పేపర్ని బయటికి లాగాడతను. అది వీరేంద్ర రాసిన ఉత్తరం.

"మనస్సున్న మనుషులందరికీ నమస్కారాలు. నన్ను క్షమించండి. నేను పిరికివాణ్ని కాదు. నాకు ఏ ట్రిక్కూ తెలీవు. నేను సైన్సు గ్రాడ్యుయేట్ని. తమ సర్వస్వాన్నీ నా చదువుకే వినియోగించిన నా తల్లిదండ్రులకి నేనివ్వగలిగింది 'ఆకలిచావున్ని' మాత్రమే. అవినీతి, లంచగొండితనం, రిజర్వేషన్లు నాకు నిరుద్యోగాన్ని మిగిల్చాయి. నాపై ఆధారపడివున్న ముగ్గురు చెల్లాయిలకి ఒక్కపూటకూడా భోజనం పెట్టలేని స్థితినాది.

'ఇందరు ప్రజలమధ్య, ప్రముఖులమధ్యన నేను చేసుకుంటున్న ఈ 'ఆత్మహత్య' ఈ ప్రజల్లో సంచలనం, చైతన్యం కలిగించాలనీ; నా చెల్లాయిలకి బ్రతుకుతెరువునీ, నాలాంటి నిరుపేద నిరుద్యోగులకు బ్రతుకుదారినీ చూపించగలిగితే నా ఆత్మకుశాంతి కలుగుతుంది. డబ్బుకోసం నా స్నేహితుల్లా నటించినవారిని నన్ను క్షమించమని ప్రార్థిస్తున్నాను. వాళ్ళకీవిషయంలో ఏలాంటిసంబంధమూలేదు. వాళ్ళనివదిలెయ్యండి"

ఉత్తరం చదవటం పూర్తిచేసిన పోలీసాఫీసరు మౌనంగా ఆ ఉత్తరాన్ని కలెక్టరుగారికి అందించాడు. క్షణాల్లో ఈ విషయం ప్రజలందరికీ తెలిసిపోయింది. మర్నాడీవిషయాన్ని అన్నిపత్రికలూ ప్రముఖంగా ప్రచురించి సంచలనం కలిగించాయి. ఓ పదిరోజులు. ఓ నెల ఈ విషయం గురించి చర్చించుకున్నారు ప్రజలు. అంతే.... తర్వాత అందరూ మరిచిపోయారు ఈ సంఘటన మరుగున పడిపోయింది. *

పవన్,
కార్టూనిస్ట్
8-150
ప్రకాష్‌నగర్
కడప-516 004.

స్రవంతి నెం. 19లో ఇచ్చిన
"ఈ గ్లాసులోని పాలను మూడుభాగాలు చేసి ఒకదాంట్లో మాత్రమే అదిగో ఆ పొట్లంలోని విషాన్ని కలిపి నాకివ్వండి" చెప్పాడు వీరేంద్ర తన ఇద్దరి స్నేహితులతో.
వాక్యం ఆధారంగా రాసిన కథలు

## "ది ట్రాప్"

వీరేంద్ర మనసు అగ్నిగుండంలా మండిపోతూవుంది.

పగ, ప్రతీకార జ్వాలలు అతని రక్తాన్ని సలసలా ఉడుకెత్తిస్తున్నాయి.

తన భార్య అరుణ మరణం వెనుక అసలు నిజాలు ఒక్కొక్కటే తెలుస్తూవుంటే ఆశ్చర్యంతో, భయంతో బిగుసుకుపోయాడు వీరేంద్ర.

అరుణను ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు వీరేంద్ర. ఎంతో ఆనందంగా సాగిపోతుంది వారి దాంపత్యం. పెళ్ళయి సంవత్సరం తిరక్కుండానే ఆత్మహత్య చేసుకొని మరణించింది అరుణ. ఒంటినిండా కిరోసిన్‌పోసి [illegible]కొని మరణించింది. ఆ వార్తకు షాక్ తిన్నాడు వీరేంద్ర. అరుణ ఎందుకలాచేసిందో ఎంత ఆలోచించినా అర్థంకాలేదు వీరేంద్రకు. మనశ్శాంతి కరువై ఒక సంవత్సరంపాటు శెలవుపెట్టి దేశాటన బయలుదేరాడు.

కేదారినాథ్, పండరీపురం, గంగోత్రిలాంటి ఎన్నో పుణ్యక్షేత్రాలు తిరిగి వచ్చాడు.

మరుగునపడ్డ ఎన్నో నిజాలు ఒక్కొక్కటే తెలియసాగాయి వీరేంద్రకు.

అరుణను తన మిత్రులు శేషు, నాగేశం బలవంతంగా మానభంగం చేసారని, ఆ అవమానం భరించలేక, తనకు ముఖం చూపించలేక, మలినమైపోయిన తన శరీరాన్ని అగ్నికి ఆహుతి చేసుకుని పునీత అయిపోయింది. తను క్యాంపుకు వెళ్ళిన అవకాశాన్ని తీసుకుని, తనమిత్రులిద్దరూ త్రాగినమైకంలో, కామపిశాచులై, రాక్షసులై తన భార్య జీవితాన్ని బలితీసుకున్నారు.

పగ!

వాళ్ళమీద కసి తీర్చుకోవాలి. చట్టాలు, న్యాయస్థానాలు లాభంలేదు. తనకి ఆధారాలు లేవు. తను మరణించినా ఫర్వాలేదు. వాళ్ళను ఉరికంబం ఎక్కించాలి. తనకు ఎలాగూ బ్రతుకుమీద తీపిలేదు. అరుణతోనే అన్నీ పోయాయి. వాళ్ళని ఉరికంబం ఎక్కించి తన ప్రతీకారం తీర్చుకోవాలి. అరుణ ఆత్మకు శాంతికలిగించాలి.

ఎంతో ఆలోచించి ఒక పథకాన్ని సిద్ధం చేసాడు వీరేంద్ర!

* * * *

నమ్మలేనట్టుగా వీరేంద్ర వైపు చూశారు శేషు, నాగేశం.

"ఏమిటీ విషాన్ని జీర్ణించుకొనే శక్తి సంపాదించావా?" అని అడిగారు.

"అవును. మనశ్శాంతి లేకుండా హిమాలయ ప్రాంతాల్లో తిరుగుతూవుండగా ఒక సాధువుతో పరిచయం అయింది. ఆయన దగ్గర ఎన్నో వనమూలికలు వున్నాయి. ఎలాంటి విషాన్నైనా జీర్ణం చేసుకోగల మూలికలను నాతో తినిపించాడు." అన్నాడు వీరేంద్రే.

మళ్ళీ తనే అన్నాడు.

"ముందుగా ఈ ప్రయోగాన్ని మీ ముందు నిరూపిస్తాను. ఆ తర్వాత ప్రదర్శనలు యిస్తాను.

"ఇవిగో పాలు. ఈ గ్లాసులోని పాలను మూడు భాగాలుచేసి ఒక దాంట్లో మాత్రమే అదిగో ఆ పొట్లంలోని విషాన్ని కలిపి నా కివ్వండి" చెప్పాడు వీరేంద్ర తన ఇద్దరి స్నేహితులతో,

శేషు పొట్లాన్ని తీసి విషాన్ని వీరేంద్ర గ్లాసులో కలిపాడు. నాగేశం ఆ గ్లాసును తీసి వీరేంద్రకు అందించాడు.

పొట్లంమీద, గ్లాసుమీద మిత్రులిద్దరి వేలిముద్రలు పడినవని తెలిసి గ్లాసు అందుకొని గడగడా తాగేశాడు వీరేంద్ర.

"రేపు ఉదయం నేను వచ్చి మీ యిద్దరికీ గుడ్ మార్నింగ్ చెపుతాను. వెళ్ళిరండి" అని మిత్రులను సాగనంపాడు.

ఆ తర్వాత చకచకా పనులు ప్రారంభించాడు.

ఒక ఉత్తరం వ్రాసిపెట్టాడు.

"తన భార్య మరణానికి కారణం తన మిత్రులేనని తనకి తెలిసిందని, తనను కూడా హతమార్చడానికి మిత్రులిద్దరూ ప్రయత్నిస్తున్నారని, ఏ క్షణంలోనైనా తన ప్రాణాలు వారి చేతిలో పోవచ్చుని" పోలీసులకు లేఖ వ్రాశాడు.

మంచం మీద పడుకొని అరుణ ఫోటోవైపు చూస్తూ తృప్తిగా ఆమె వైపు చూస్తూ శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు వీరేంద్ర.

వీరేంద్ర లేఖ, వేలిముద్రల ఆధారంగా శేషు, నాగేశంలను అరెస్టుచేశారు పోలీసులు.

కోర్టు వారికి ఉరిశిక్ష విధించింది.

స్వర్గంలో వీరేంద్ర ఆత్మ తృప్తిగా నవ్వుకుంది. *

-ఇ.టి. రామారావు
పర్చేస్ అసిస్టెంట్
ఇండియన్ స్పేస్ రీసెర్చి ఆర్గనైజేషన్,
శ్రీహరికోట-524 124

### ఓ కథ రాయండి

**ఈక్రింది ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజి మించకుండా ఓ కథరాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.**

"ఏమిటి, మీపెళ్ళికి ముందు నీభర్త అవిటివాడని నీకుతెలీదా?" ఆశ్చర్యంగా అడిగింది భారతి తన ఫ్రెండ్ పూర్ణని.